క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కడియం: వివిధ అంశాలపై చర్చించేందుకు కడియం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30కు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. ఈ సమావేశంలో శాఖల వారీగా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష ఉంటుందన్నారు. సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

వ్యవసాయ శాఖలో బదిలీలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం సహాయ వ్యవసాయ సంచాలకుడి కార్యాలయ పరిధిలో పలు బదిలీలు జరిగాయి. కడియం వ్యవసాయాధికారిగా పద్మలత, రాజానగరం వ్యవసాయాధికారిగా కల్యాణ సూర్యకుమార్, పీఏ టు ఏడీఏగా కె.సూర్యరమేష్ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా కె.సురేష్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్‌గా సుందరి నియమితులయ్యారు.

ట్రాఫిక్ బారికేడ్ల అందజేత

కంబాలచెరువు: నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు మ్యాక్సీ విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ మంగళవారం పది బారికేడ్లను అందజేసింది. వాటిని ఏఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణ సమక్షంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.రమేష్ బాబు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మురళీకృష్ణ, డాక్టర్ పి.హారిక ప్రియంవద, డాక్టర్ ఆర్.స్వాతినిషిత, అజయ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మారణకాండ ఆపాలి

ప్రకాశం నగర్: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ ఆపాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జాంపేట ఆజాద్‌చౌక్ సెంటర్‌లో పాలస్తీనాకు సంఘీభావంగా సీపీఐ, సీపీఐ-ఎం, సీపీఐ-ఎంఎల్ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీపీఐ-ఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.పవన్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో పాలస్తీనా ప్రజలు 55 వేల మందికి పైగా మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారని తెలిపారు. పాలస్తీనా ప్రజలకు భారతదేశం సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు అందిస్తున్న సైనిక, భద్రత సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ-ఎంఎల్ నాయకుడు వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



మాధవరాయుడుపాలెంలో శంకుస్థాపన చేస్తున్న ఎంపీ. చిత్రంలో ఎమ్మెల్యే తదితరులు

కడియం: వివిధ గ్రామాల్లో రూ.4.56 కోట్ల అభివృద్ధి పనులకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మంగళవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మాధవరాయుడుపాలెం పంచాయతీ గుబ్బలవారిపాలెంలో రూ.20 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేశారు. అక్కడే రూ.7 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనాలను ప్రారంభించారు. ఉపాధి నిధులు రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ప్రారంభించి, దామిరెడ్డిపల్లిలో రూ.80 లక్షలతో ప్రధాన రహదారి, రూ.40 లక్షలతో రోడ్డు, వీరవరంలో రూ.30 లక్షలతో, కడియపులంకలో రూ.70 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపనలు జరిగాయి. కడియపులంకలో రూ.6 లక్షలతో నిర్మించే బీసీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేశారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: థగ్ లైఫ్
సూర్య మినీ	: బల్లెరినా
సూర్య ప్యాలెస్	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
స్వామి	: ది హంటర్, శ్రీశ్రీశ్రీ రాజావారు
శివజ్యోతి	: కట్టప్ప జడ్జిమెంట్, పాపా (ఓ నాన్నా)
అనుశ్రీ	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
రాజా	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
ఊర్వశి	: అందాల రాక్షసి
మేనక	: శుభం, పాడేరు 12వ మైలు
రంభ	: ఫైనల్ డెస్టినేషన్
అప్సర	: సింగిల్
అశోక	: భైరవం
నామవరం	
వీఎస్ మహల్	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
కడియం	
వెంకటసూర్య	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్

రహజారులు

- లారీల్లో ఇసుక ఓవర్ లోడ్‌తో ఇక్కట్లు
- రోడ్లపైనే ఇసుక మేటలు
- ప్రజలకు పొంచి ఉన్న ముప్పు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



అధిక లోడుతో వెళుతున్న ఇసుక లారీ

రాజమహేంద్రవరం రూరల్: ఇసుక ర్యాంపులకు అనుసంధానంగా ఉన్న రహదారులు ప్రజలకు ప్రాణసంకటంగా మారాయి. లారీలు, టిప్పర్లలో పరిమితికి మించి ఇసుకను రవాణా చేస్తుండడంతో.. అనేక చోట్ల ఇసుక మేటలు తయారవుతున్నాయి. వాహనచోదకులు వాటిని గమనించకుండా ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు ఈ నెల ఒకటో తేదీ నుంచి ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయాలని మైన్స్ అధికారి ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. అక్రమార్కులు మాత్రం నదీగర్భాన్ని తొలిచేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ.. వాహనదారుల భద్రతను గాలికి వదిలేస్తున్నారు. వీలైనంత వేగంగా ఇసుక కొల్లగొడదామనే ఉద్దేశంతో.. నిబంధనలు పాటించకుండా వాహనాలపై పరిమితికి మించి ఇసుక లోడును తరలిస్తున్నారు. రవాణా చేసే సమయంలో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా, టార్పాలిన్ కప్పి ఇసుకను తరలించాలని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. పరిమితికి లోబడి లోడు చేసిన వాహనాల వల్ల పెద్దగా ఇబ్బందులు కలగడం లేదు. కానీ పరిమితికి మించి లోడు చేసిన వాహనాల నుంచి దారిపొడవునా ఇసుక జారి పడుతోంది. దీంతో వాహనం పక్కనుంచి ప్రయాణించే వారి కళ్లల్లో ఇసుక రేణువులు పడుతున్నాయి. అంతేకాకుండా ఇసుక రోడ్డుపై పడడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి జారిపడుతున్నాయి. రేయింబవళ్లు యథేచ్ఛగా అధిక లోడుతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ.. పోలీసులు, రవాణా శాఖల యంత్రాంగాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. అధిక లోడుతో వెళుతున్న వాహనాలు వీరికి కనిపించకపోవడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ధవళేశ్వరం ర్యాంపుల నుంచి..

ప్రతిరోజు ధవళేశ్వరం ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక లోడు లారీలు ఐఎల్‌టీడీ జంక్షన్, బాలాజీపేట, బొమ్మూరు జాతీయ రహదారి మీదుగా లాలా చెరువు, రాజవోలు వైపు వెళుతున్నాయి. అధిక లోడుతో వెళుతున్న ఇసుక లారీల నుంచి దారిపొడవునా మలుపుల్లో ఇసుక జారి కింద పడుతోంది. ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి రైల్వే ఓవర్ బ్రిడ్జి, బాలాజీపేట, బొమ్మూరు జాతీయ రహదారిపైన, హుకుంపేట, మోరంపూడి ఫ్లైఓవర్ నుంచి లాలా చెరువు వరకు, అలాగే రాజవోలు రోడ్డులోను ఇసుక రహదారిపై పడి మేటలుగా తయారవుతోంది. ఒక వైపు నగరపాలక సంస్థ, పంచాయతీ, నేషనల్ హైవే సిబ్బంది నిత్యం ఇసుకను తొలగించే పనులు చేపడుతున్నారు. ఇసుక రోడ్డుపై పడడం వల్ల ద్విచక్ర వాహనచోదకులు జారిపడి, ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇలా నిత్యం ప్రమాద సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీనిని పర్యవేక్షించాల్సిన రవాణా, పోలీసు శాఖ అధికారులు పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, పోలీసు, రవాణా శాఖల అధికారులు తగు చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.



రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద..



హుకుంపేట వద్ద జాతీయ రహదారిపై..



ధవళేశ్వరం-ఐఎల్‌టీడీ రోడ్డులో ఇసుక మేట



బొమ్మూరు వద్ద జాతీయ రహదారిపై..



బాలాజీపేట రోడ్డుపై ఇలా..

నేడు, రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమ్మతుల కోసం నగరంలో పలు ప్రాంతాల్లో బుధ, గురువారాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఈఈ నక్కపల్లి శామ్యూల్ మంగళవారం తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పోలీస్ క్వార్టర్స్, కవలగొయ్యి, పిడింగొయ్యి, హైవే రోడ్ ఏరియా, ఫ్యూచర్‌కిడ్స్, తారకరామా నగర్, బాలాజీనగర్, రూపానగర్, స్వరూప నగర్, మహాలక్ష్మినగర్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొంతమూరు సబ్ స్టేషన్, సుబ్బారావు నగర్ సబ్ స్టేషన్, భవానీపురం ఫీడర్, తొర్రేడు సబ్‌స్టేషన్ పరిధిలో ప్రభావం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకూ రాయడుపాకలు, కొలమూరు, కొంతమూరు గ్రామాల్లోని పరిమినగర్, బొమ్మన కాలనీ, ఫోర్త్ బ్రిడ్జి ప్రాంతం, కల్యాణ్ నగర్, ఆదర్శనగర్, నూకాలమ్మ గుడి, ముస్లింపేట, జంగాల కాలనీ, పంచాయతీ ప్రాంతం, బ్రాహ్మణ అగ్రహారం, సాయిరాం కాలనీ, శేషాద్రి లేఅవుట్, క్వారీ ఏరియా, కంటిపూడి లేఅవుట్, 14 ఏకరాల లేఅవుట్, బీసీ కాలనీ, కాతేరు గ్రామంలోని శాంతినగర్, తిరుమల కళాశాల, పంచాయతీ ప్రాంతం, బ్రాహ్మణ అగ్రహారం, భవానీపురం, సంతోష్‌నగర్, చందన రమేష్ లేఅవుట్, సున్నంబట్టి రోడ్, తొర్రేడు, వెంకటనగరం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

అభివృద్ధిని కొనసాగించకపోవడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- నగరాన్ని తీర్చిదిద్దిన మాజీ ఎంపీ భరత్
- ఎమ్మెల్యే తీరును తప్పుబట్టిన వైఎస్సార్ సీపీ నేతలు

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని ఎన్నో రకాలుగా మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అభివృద్ధి చేస్తే, వాటిని ప్రస్తుత ఎమ్మెల్యే కొనసాగించడం మాని.. విమర్శలు చేయడం సరైన విధానం కాదని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ మాజీ నగర అధ్యక్షుడు సప్పా ఆదినారాయణ, నగర వలంటీర్ల విభాగం అధ్యక్షురాలు అనంతలక్ష్మి తప్పుబట్టారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నగర చరిత్రలో ఇంతవరకు ప్రాతినిధ్యం వహించిన ప్రజాప్రతినిధులందరూ తమ పరిధిలో అభివృద్ధి చేశారని, ఒకరి తర్వాత ఒకరు అభివృద్ధిని కొనసాగించారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దారుణమన్నారు. మాజీ ఎంపీ భరత్‌రామ్ నగరాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తే.. నాశనం చేశారంటూ తన అనుయాయుల ద్వారా చెప్పించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అనుచరుడు సత్యదేవ్ అనే వ్యక్తి, ఎస్సీ బాలికను మభ్యపెట్టి, గర్భవతిని చేశాడని ఆరోపించారు. దళిత అమ్మాయికి అన్యాయం జరిగితే, అండగా నిలబడి న్యాయం జరిగేలా చూస్తానని భరత్‌రామ్ చెప్పడంలో తప్పేమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో సామాన్యులకు న్యాయం జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భరత్‌రామ్ చేయించిన అభివృద్ధి పనులపై ఇబ్బందులుంటే, సంబంధిత కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులను ఎమ్మెల్యే నిలదీయాలన్నారు. నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్తతో దారుణంగా తయారైన విషయం కూడా ఎమ్మెల్యే గుర్తించాలన్నారు. టీడీపీ నాయకులు తప్పు చేసిన వారిని సస్పెండ్ చేస్తామంటూ గొప్పగా చెబుతున్నారని, గంజాయి కేసులో ఉన్న వ్యక్తికి బర్త్ డే పార్టీ జరిపించడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు తిరగాటి దుర్గ, సోషల్ మీడియా అధ్యక్షుడు రేగుళ్ల నాని, వార్డ్ ఇంచార్జ్ మునీశ్వర్, నాయకులు అనురాధ, కృష్ణవేణి, శ్యామ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రం.. బీ కేర్‌ఫుల్ బ్రదరూ..



పేపర్‌మిల్లు వద్ద పెట్రోల్ బంక్ వైపు నుంచి కాతేరు వెళ్లే రోడ్డు దుస్థితి

రాజమహేంద్రవరం సిటీ: అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి పరాకాష్టే ఈ రహదారి దుస్థితి. కొద్దిపాటి చినుకులు పడితే.. ఇదిగో ఇలా చిత్తడిగా తయారవుతుంది ఈ రోడ్డు. నగరంలోని పేపర్ మిల్లు నుంచి కాతేరుకు వెళ్లే రోడ్డు ఇది. మంగళవారం సాయంత్రం కొద్దిసేపటి వర్షానికే ఇలాగైంది. ఈ రోడ్డులో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలో రహదారుల నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో దీనిని చూస్తే అవగతమవుతుంది.

పిల్లల్లో అమాయకత్వం వల్లే అఘాయిత్యాలు

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి ఆందోళన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న శ్రీలక్ష్మి

కంబాలచెరువు: సమాజంలో పిల్లల అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుని కొందరు వారిపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, మోసపూరితంగా అక్రమ కార్యకలాపాలకు వాడుకుంటున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీతంపేటలోని పంతం సత్యనారాయణ ఎలిమెంటరీ స్కూల్‌లో మంగళవారం మంచి, చెడు స్పర్శలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, పిల్లల విషయంలో ఎవరూ హద్దులు దాటి ప్రవర్తించరాదని హెచ్చరించారు. పిల్లలు కూడా చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యార్థులు చదువుపై ఆసక్తి కలిగి ఉండాలని, వివిధ విషయాలపై పరిజ్ఞానం పెంచుకోవాలని ఉద్బోధించారు. బాల్య వివాహ నిషేధ చట్టం-2006, బాల కార్మిక నిర్మూలన చట్టం-1986 తదితర వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నల్సా (పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు) పథకం-2024 ద్వారా తమ సంస్థ పిల్లలకు అందిస్తున్న న్యాయ సేవలను వివరించారు. పిల్లలకు ఎలాంటి న్యాయ సమస్యలు ఎదురైనా తమ సంస్థను సంప్రదించాలన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న భోజనాన్ని ఈ సందర్భంగా ఆమె పరిశీలించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు

సీటీఆర్ఐ: నగరంలోని డీఎంహెచ్ స్కూలు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం స్థానిక ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. స్కూలుకు చెందిన 1980-81 బ్యాచ్ విద్యార్థులు 46 ఏళ్ల తర్వాత రెండోసారి ఆత్మీయంగా కలిసి, ఒకరి అనుభవాలను మరొకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు సైన్స్ టీచర్ దూర్వాసుల రామకృష్ణ, పీఈటీ సప్ప సుబ్బారావును సత్కరించారు. ఈ కార్యక్రమానికి 66 మంది పూర్వ విద్యార్థులు హాజరై, తమ పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థి ప్రతినిధులు బొమ్మిశెట్టి మల్లికార్జునరావు, ఎం చంద్రశేఖర్, కోన రామకృష్ణ తదితరుల ఆధ్వర్యంలో ఈ సమ్మేళనం ఆనందంగా జరిగింది.

నవ ధాన్యాల సాగుకు సమాయత్తం



నవ ధాన్యాల సాగును పరిశీలిస్తున్న మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: రైతులు నవధాన్యాల సాగు ద్వారా తమ పొలాలను సారవంతం చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవరావు అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి మండలంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ ద్వారా భూమిని సారవంతం చేసుకునేందుకు పీడీఎంఎస్ కిట్లు సాగు చేస్తున్నట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని తొర్రేడు గ్రామంలో చేపట్టారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ, రైతులకు త్వరలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సాగు పరికరాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని సూచించారు. ఇకపై ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి భీమరాజు అన్నారు. పశు వైద్యాధికారి ప్రసన్నకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు పీటర్, వేణుమాధవ్, ఉద్యాన, మత్స్య శాఖల అధికారులు, రైతులు మద్దుకూరి శ్రీనివాస్, దండమూడి రామచంద్రం, మల్లిన సతీష్, కొత్తపల్లి సత్యనారాయణ, తొర్రేడు వీఏలు ఎన్‌డీ శ్రీనివాస్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

సిఫారసు చేసిన ఎరువులతో అధిక దిగుబడి

రాజానగరం: భూసార పరిరక్షణలో భాగంగా పంటలకు సిఫారసు చేసిన ఎరువులను వినియోగిస్తే.. భూమి స్వరూపం దెబ్బతినకుండా, పర్యావరణ సమతుల్యతను కాపాడుకుంటూ నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని రాజమహేంద్రవరంలోని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డి.శేఖర్ అన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాల పరిధిలోని డీలర్లకు సర్టిఫికెట్ కోర్సులో ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం భూసారం పెంపుదలకు సమర్థ ఎరువుల వినియోగం అనే అంశంపై తరగతులు జరిగాయి. కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు మాట్లాడుతూ, ఎరువులు వాడే విధానం, సేంద్రియ ఎరువుల వినియోగంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కన్నమాంబ దర్శనం.. భక్తజన పరవశం



ప్రత్యేకాలంకరణలో కన్నమాంబ పేరంటాలమ్మ వారు



వేంకటేశ్వరస్వామి, ఇతర వేషధారణల్లో కళాకారులు



గరగ నృత్యాలు చేస్తున్న కళాకారులు



అమ్మవారి చల్లఘటాలను ఊరేగిస్తున్న భక్తులు



ఆకట్టుకున్న శక్తి వేషధారణ

- వైభవంగా మహోత్సవాలు
- పురవీధుల్లో చల్లఘటాల ఊరేగింపు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కన్నమాంబ పేరంటాలమ్మ వారి 127వ జాతర మహోత్సవాలు స్థానిక అల్కాట్‌తోట శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగాయి. శెట్టిబలిజ రామాలయం వద్ద నుంచి కన్నమాంబ పేరంటాలు అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి పూల గరగలు, సేవగరిడి, శక్తి వేషాలు గరగ నృత్యాలు, వేంకటేశ్వరస్వామి అలివేలు పద్మావతి వేషధారణలు, డీజేతో పాటు, బాణసంచా కాల్పులు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. తుదకు అమ్మవారి చల్లఘటాలను ఊరేగింపుగా రైల్వేస్టేషన్ సమీపంలో కన్నమాంబ అమ్మవారి ఆలయం వద్దకు తీసుకువెళ్లారు. అమ్మవారిని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దర్శించుకున్నారు.

జాతర సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో టూటౌన్ ఇన్‌స్పెక్టర్ శివగణేష్, ఎస్సైలు, సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు.